క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కార్తీక దామోదర ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ రాధాకృష్ణులు

కొమ్మాది: బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో కార్తీక దామోదర మాసోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథ స్వాములను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం మంగళ హారతితో ప్రారంభమై గోపిగీత, భగవద్గీత 12వ అధ్యాయం, శిష్టాష్టకం పారాయణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

విద్యాసంస్థల బంద్‌కు పిలుపు

తగరపువలస : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ ఈ నెల 8న విద్యాసంస్థల బంద్‌ను పాటించాలని కోరుతూ ఆదివారం విద్యార్థి, యువజన సంఘాల ప్రతినిధులు చిట్టివలసలో పోస్టర్ విడుదల చేశారు. ఎస్ఎఫ్ఐ నుంచి తేజశ్రీ, టి.వాసు, సూర్య, డీవైఎఫ్ఐ నుంచి శిరువురి శ్రీనివాసవర్మ, గుజ్జు సూరిబాబురెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఉద్యమానికి ఊపిరి పోసిన విద్యార్థి లోకం ఇప్పుడు మరో మారు ఉద్యమించే సమయం ఆసన్నమైందన్నారు. ఏఐఎస్ఎఫ్ కూడా బంద్‌కు పిలుపునిస్తూ భీమిలిలో ప్రచారం చేసింది.

'సురక్ష' శిబిరం నేడు

మధురవాడ: జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా జీవీఎంసీ 5వ వార్డు వైఎస్సార్ కాలనీ 72వ నంబరు సచివాలయంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అధికారులు చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి వైద్య నిపుణులు, సిబ్బంది సేవలు అందిస్తారని తెలిపారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శిబిరంలో పాల్గొని రోగులకు మందులు పంపిణీ చేస్తారని, అవసరమైన వారంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాత్రికి రాత్రే బడ్డీల ఏర్పాటు



ఎండాడ రహదారికి ఆనుకుని ఏర్పాటు చేసిన కంటైనర్ బడ్డీ

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్, రుషికొండ, ఎండాడ ప్రధాన రహదారుల వెంట రాత్రికి రాత్రే అనధికారికంగా బడ్డీలు, కంటైనర్లు ఏర్పాటు చేసేస్తున్నారు. జీవీఎంసీ నుంచి అనుమతులు లేకుండా వీటిని ఏర్పాటు చేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ప్రధాన కూడళ్ల వద్ద అనధికారికంగా దుకాణాలు ఉండకూడదని ఉన్నతాధికారులు ఆదేశించినా ఫలితం శూన్యం. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పాత మూలకుద్దులో డ్రైనేజీలు శిథిలం



పాత మూలకుద్దు వద్ద శిథిలమైన డ్రైనేజీ

తగరపువలస: భీమిలి మండలం పాతమూలకుద్దు ఆర్ అండ్ బీ రహదారిని ఆనుకుని ఉన్న పంచాయతీ డ్రైనేజీలు శిథిలమయ్యాయి. ఈ డ్రైనేజీలో నుంచే తాగునీటి పైప్‌లైన్లు కూడా ఉన్నాయి. దశాబ్దాల క్రితం రాతితో నిర్మించిన డ్రైనేజీలు నామరూపాల్లేకుండా పోవడంతో చాలావరకు పూడుకుపోయాయి. అలాగే ఆర్ అండ్ బీ రహదారిని ఆనుకుని ఉండడంతో వాహనాల తాకిడి కూడా ఎక్కువగా ఉంది. ఈ గ్రామంలో డ్రైనేజీలను పునర్నిర్మించాలని విశ్రాంత వీఆర్వో కొయ్య అప్పల సూర్యనారాయణరెడ్డి, తదితరులు కోరుతున్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు

పోలింగ్ కేంద్రాల పరిశీలనలో ఆర్‌డీవో భాస్కర్ రెడ్డి



పీఎంపాలెంలో ఓటర్ల జాబితా సవరణను పరిశీలిస్తున్న ఆర్‌డీవో భాస్కరరెడ్డి



సాగర్‌నగర్ పోలింగ్ కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌డీవో భాస్కర్ రెడ్డి

కొమ్మాది: ప్రతి ఒక్కరూ ఓటరు జాబితా పరిశీలించి ఓటు ఉందో లేదో పరిశీలించుకోవాలని ఆర్‌డీవో భాస్కర్‌రెడ్డి సూచించారు. జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో గల మేరీస్టెల్లా స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులను పరిశీలించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా పక్కాగా తయారు చేయడానికి అందరూ సహకరించాలని కోరారు. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలన్నదే తమ లక్ష్యమన్నారు. అదే విధంగా డూప్లికేట్, చనిపోయిన వారి ఓట్లు తొలగిస్తున్నట్లు తెలిపారు.

మధురవాడ: ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో శక్తివంతమైనదని, 18 ఏళ్లు నిండిన వయోజనులంతా ఓటు నమోదు చేయించుకోవాలని ఆర్‌డీవో భాస్కరరెడ్డి సూచించారు. మధురవాడ జోన్‌లోని పరదేశిపాలెం, పీఎం పాలెం తదితర ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్ల నమోదు, సవరణలు జరుగుతున్న తీరు సిబ్బందిని, కేంద్రాలకు వస్తున్న వారిని అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో జరగబోయే సవరణ, అవగాహన కార్యక్రమాలపై మరింత విస్తృతంగా ప్రచారం కల్పించనున్నట్టు చెప్పారు. ప్రత్యేక ఓటర్ల సవరణ, ఇతర కార్యక్రమాలను అంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే సిబ్బంది మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు.

మాదక ద్రవ్యాలతో పట్టుబడితే పీడీ యాక్ట్

- రౌడీ షీటర్లపై నిరంతర నిఘా
- నగర పోలీస్ కమిషనర్ రవి శంకర్



ఆనందపురం పోలీస్ స్టేషన్ వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీపీ రవి శంకర్

ఆనందపురం : ప్రశాంత విశాఖ నగరంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని నగర పోలీస్ కమీషనర్ ఎ.రవి శంకర్ హెచ్చరించారు. ఆయన ఆనందపురం పోలీస్ స్టేషన్‌ను ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ రవిశంకర్ మాట్లాడుతూ గంజాయి, హెరాయిన్, కొకైన్ వంటి మాదక ద్రవ్యాలతో తరచూ పట్టుబడుతూ కేసులు నమోదవుతున్న వారిపై పీడీ యాక్ట్ పెట్టడానికి నిర్ణయించామన్నారు. అలాంటి వారిపైన, రౌడీ షీటర్లపైన నిరంతరం నిఘా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఆపద సమయంలో మహిళలకు దిశ యాప్ ఆయుధంలా ఉపయోగపడుతోందని, దానిపై విస్తృతంగా ప్రచారం నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. నమోదవుతున్న కేసుల వివరాలతోపాటు పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాల వివరాలు, అలాంటి చోట తీసుకుంటున్న ముందస్తు చర్యలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అనంతరం స్టేషన్‌లో గల రికార్డులను పరిశీలించి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

గ్రేహౌండ్స్ స్థలం పరిశీలన

మండలంలోని చందక పంచాయతీ జగన్నాథపురంలో గ్రేహౌండ్స్ నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని సీపీ రవి శంకర్ పరిశీలించారు. స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది నుంచి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ గ్రేహౌండ్స్ నిర్మాణం కోసం ప్రభుత్వం 300 ఎకరాల భూమిని కేటాయించింది. అనంతరం సీపీ ఆ పక్కనే ఉన్న ఐటీబీపీ బెటాలియన్‌ను సందర్శించారు. అక్కడ సిబ్బందితో మాట్లాడారు. బెటాలియన్ కార్యాలయాలు, పరిసరాలు పరిశీలించారు.

భగవన్నామస్మరణతో మానసిక ప్రశాంతత



శ్రీధర్మ శాస్త్ర సేవా పీఠం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



పూజలు చేస్తున్న పీఠాధిపతులు పరమాత్మానంద గిరి స్వామి, శ్రవణ చైతన్యానంద చినస్వామి

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- మద్ది గ్రామంలో శ్రీధర్మ శాస్త్ర సేవా పీఠం ప్రారంభం

పద్మనాభం: భగవన్నామస్మరణతో మానసిక ప్రశాంతత కలుగుతుందని భీమునిపట్నం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మద్ది గ్రామంలో భక్తుల సహకారంతో నిర్మించిన శ్రీ ధర్మ శాస్త్ర సేవా పీఠాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అందరూ భక్తి భావాన్ని అలవరచుకోవాలని సూచించారు. కాశీ మలయాల స్వామి ఆశ్రమం పీఠాధిపతి పరమాత్మానందస్వామి, నెల్లిమర్ల దుర్గా పీఠం పీఠాధిపతి శ్రవణ చైతన్యానంద చిన స్వామి మాట్లాడుతూ అధ్యాత్మకతను అలవరచుకున్నప్పుడే సమస్యల నుంచి బయటపడగలమని తెలిపారు. మాల ధరించేటప్పుడు నియయాలు పాటిస్తేనే సార్థకత ఉంటుందన్నారు. భక్తి భావంతోనే సన్మార్గంలో పయనించగలరని సూచించారు. కార్యక్రమంలో పద్మనాభం ఎంపీపీ కంటుబోతు రాంబాబు, భీమునిపట్నం ఎంపీపీ వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైఎస్సార్ సీపీ పద్మనాభం మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, మద్ది సర్పంచ్ బుగత సన్యాసమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు తులసి లక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు బుగత సత్యనారాయణ, బుగత ఎర్నాయుడు, బొలె అప్పలనాయుడు, తాలాడ పద్మనాభం, బోని సన్యాసినాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు.

ఉత్సాహంగా కేబుల్ యూనియన్ వార్షికోత్సవం

తగరపువలస: భీమిలి, భోగాపురం, ఆనందపురం కేబుల్ యూనియన్ వార్షికోత్సవం ఆదివారం తగరపువలసలో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీబీఏ జేఏసీ జెండాను జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గాడు వెంకటనారాయణ, నీలాపు సూర్యనారాయణ, కేబుల్ ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, నాయకులు నారాయణరావు, రమణ, తమ్మిన సూర్యప్రకాష్, గోవింద్, సత్యారావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



నరసాపురంలో భగవద్గీత అందజేస్తున్న సభ్యులు

పద్మనాభం: మండలంలోని తునివలస, నరసాపురం గ్రామాల్లో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ సభ్యులు ప్రచారం చేశారు. భగవద్గీత ఆవశ్యకతను ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, సభ్యులు జి.కృష్ణ సూరప్పడు, బి.అప్పలనాయుడు, కె.రాజు, కె.లక్ష్మి పాల్గొన్నారు.

కేపీకి వైఎస్సార్ సీపీ నాయకుల పరామర్శ



సీనియర్ నాయకుడు కేపీ సత్యనారాయణను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కేపీ సత్యనారాయణను ఆదివారం ఎంపీపీ దంతులూరి వాసురాజు సహా పలువురు నాయకులు పరామర్శించారు. పచ్చకామెర్లతో బాధపడుతున్న అతడిని ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని జాగ్రత్తలు చెప్పారు. పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, జిల్లా క్వారీ లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు మద్దిల వెంకటరమణ, పొట్నూరు చంద్రశేఖర్, తుపాకుల అప్పలరాజు, కరుభుక్త వెంకటరమణ, ఉండబట్ల చిన్నారావు, మొకర పైడినాయుడు, కరుభుక్త అప్పలరాజు, మద్దిల శివకుమార్ తదితరులు పరామర్శించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



రేవిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పద్మనాభం: మండలంలోని రేవిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005 - 2006 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని చిన్ననాటి జ్ఞాపకాలు నెమరవేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా, ఉల్లాసంగా గడిపారు. తమకు పాఠాలు నేర్పిన ఉపాధ్యాయులు ఎం.వి.కృష్ణ కుమార్, కనకల శ్రీనివాసరావును సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సీర సూరప్పడు, గొలగాని బంగారునాయుడు, ముద్దాడ శ్రీనివాసరావు, చిల్లా శంకర్, తుగురోతు బంగారునాయుడు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం



చిట్టివలసలో మొబైల్ ఐసీటీసీ వాహనంతో ఆరోగ్య సిబ్బంది

తగరపువలస: ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్, సీడ్ మొబైల్ ఐసీటీసీ ఆధ్వర్యంలో ఆదివారం చిట్టివలస, రెడ్డిపల్లి గ్రామాల్లో హెచ్‌ఐవీపై అవగాహన కలిగించారు. మొబైల్ ఐసీటీసీ కౌన్సిలర్ అర్జున్ మాట్లాడుతూ గర్భిణులు తప్పనిసరిగా హెచ్‌ఐవీ పరీక్షలు చేయించుకోవాలని, అవగాహన అవసరమని సూచించారు. ఇందులో భాగంగా 46 మందికి రక్త పరీక్షలు చేశారు.

అవగాహన కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ కిశోర్‌కుమార్, లింక్ వర్కర్ ఎం.జ్యోతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిత్యం ట్రాఫిక్ కష్టాలు

మధురవాడ అప్ బ్రిడ్జి వద్ద నిర్వహణ లోపం



మధురవాడ అప్ బ్రిడ్జి వద్ద నిలిచిపోయిన వాహనాలు



అప్‌బ్రిడ్జి కింద నిలిచిపోయిన వాహనాలు

మధురవాడ: విశాఖ నార్త్ జోన్ కేంద్రం పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా మధురవాడ అప్‌బ్రిడ్జి, కార్‌షెడ్ కూడళ్లలో సర్వీసు రోడ్డు మీదనే వాహనాలు పార్కింగ్ చేసేస్తుండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు మరింత పెరుగుతున్నాయి. ఇక్కడ ట్రాఫిక్ సిబ్బంది కూడా చూసీ చూడనట్టు వ్యవహరిస్తుండడం మరీ సమస్యగా మారింది. మధురవాడ అప్‌బ్రిడ్జి వద్ద ఆదివారం మధ్యాహ్నం 12: 30 నుంచి 1 గంట సమయంలో భారీగా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో పలువురు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా రద్దీ సమయాల్లో అప్ బ్రిడ్జి కిందకి 3, 4 చక్రాల వాహనాల ప్రవేశం నిషేధం అని గతంలో ఏసీపీ బోర్డు పెట్టించినా దానిని సిబ్బంది అమలు చేయడం లేదు. ఇక్కడ ఆటోలు, 4 చక్రాల వాహనాలు, సర్వీసు రోడ్డులో వాహనాల పార్కింగ్‌తో మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ట్రాఫిక్ సిబ్బంది కూడా జరిమానాలు విధించడంలో చూపుతున్న శ్రద్ధ వాహనాల రాకపోకలను నియంత్రణలో చూపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

మర్యాదపూర్వక కలయిక



క్రిస్టియన్ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీని సత్కరిస్తున్న పిల్లా సుజాత

కొమ్మాది: విశాఖ తూర్పు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకునిగా నియమితులైన మొల్లి అప్పారావు ఎండాడలో గల వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ సహకారంతో తూర్పు నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు. ఆయనతోపాటు 15 మంది కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా రెండో సారి నియమితులైన డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీని ఎండాడలో గల వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత, సత్యానారాయణ ఆదివారం సత్కరించారు. కార్యక్రమంలో కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం చైర్మన్ కొల్లి సింహాచలం, మేరీజాన్స్, బిపిన్ జైన్, తదితరులు పాల్గొన్నారు.

నేవీ మారథాన్‌లో కేజీబీవీ విద్యార్థినులకు పతకాలు



నేవీ మారథాన్‌లో పాల్గొన్న నేరేళ్లు కేజీబీవీ విద్యార్థినులు



మారథాన్‌లో భీమిలి కస్తూర్బా విద్యార్థినులు

ఆనందపురం : విశాఖ బీచ్‌లో ఆదివారం జరిగిన నేవీ మారథాన్‌లో మండలంలోని నేళ్లేరులో ఉన్న కేజీబీవీ విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి నిర్వాహకులు పలు పతకాలు అందజేశారు. విద్యార్థినులను ఏపీడీ బి.శ్రీనివాసరావు, బాలికల సంరక్షణాధికారి కరేశా బేగం, విద్యాలయం ప్రత్యేకాధికారి చంద్రకళ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినులకు అన్ని రంగాల్లోనూ తర్ఫీదు ఇస్తున్నామని తెలిపారు.

మారథాన్‌లో పద్మనాభం విద్యార్థినులు

పద్మనాభం: విశాఖపట్నం బీచ్ రోడ్డులో ఆదివారం జరిగిన నేవీ మారథాన్‌లో పద్మనాభం కస్తూర్బా విద్యార్థినులు పాల్గొన్నారు. 25 మంది విద్యార్థినులు పతకాలు పొందారు. సమగ్ర శిక్ష జిల్లా ఏపీసీ శ్రీనివాసరావు వీరిని అభినందించారు.

భీమునిపట్నం: నేవీ మారథాన్‌లో స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గంగాకుమారి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల్లో విద్యార్థినులు పాల్గొంటే వారిలో స్ఫూర్తి, చైతన్యం పెరుగుతుందన్నారు. జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కనువిందు చేస్తున్న ఫౌంటెన్ అందాలు



భీమునిపట్నం: భీమిలి బీచ్‌కు వెళ్లే మార్గంలోని పైలాన్ పక్కన నిరుపయోగంగా ఉన్న ఫౌంటెన్‌ను అధికారులు వినియోగంలోకి తీసుకురావడంతో ఎంతో ఆకర్షణీయంగా మారింది. 20 సంవత్సరాల క్రితం అప్పటి మున్సిపల్ చైర్మన్ డి.శైలేంద్రరెడ్డి ఇక్కడ చక్కని బొమ్మలతో విశాలమైన ఫౌంటెన్ ఏర్పాటు చేయించారు. అనంతరం కొన్నాళ్లకు పాడైపోవడంతోపాటు ఎవరూ పట్టించుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వం పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడంతో ఇప్పటికే తీరంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయి.

ఈ క్రమంలో సుమారు రూ.2 లక్షలతో ఇటీవల ఫౌంటెన్‌కు మరమ్మతులు చేయించి రంగులు వేయించారు. వినియోగంలోకి తీసుకురావడంతో ఉదయం, రాత్రి వేళల్లో పనిచేస్తూ సందర్శకులకు కనువిందు చేస్తోంది. అలాగే పక్కనే ఉన్న పైలాన్ ప్రాంతాన్ని మరింత ఆధునికీకరించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

రైతు భరోసా పంపిణీ రేపు

ఆనందపురం : మండలంలోని బోని గ్రామంలో వైఎస్సార్ రైతు భరోసా పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో జరగనున్న ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతోపాటు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి విడదల రజిని, కలెక్టర్ మల్లికార్జున పాల్గొననున్నారని తెలిపారు.

వైభవంగా నృసింహుడికి ఆర్జిత సేవలు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఉదయం 7గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ప్రారంభించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అదిష్టింపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అదిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు ఘట్టాలతో నిర్వహించారు.

వైభవంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం గరుడసేవని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై అదిష్టింపజేశారు. అష్టోత్త శతనామావళి పూజ అనంతరం భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.